ANN తెలుగు

Follow: @ANNTELUGU

REGISTERED NUMBER: APTEL/2014/58382

26-09-2025

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్

సంపుటి- 22 సంచిక- 292 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శుక్రవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## కాంగ్రెస్‌ను అట్టడుగుస్థాయిలో బలోపేతం చేయాలి

### ఏఐసీసీ పరిశీలకుల సమావేశంలో రాహుల్ గాంధీ

ఢిల్లీ, మహా : కాంగ్రెస్ సంస్థను ప్రతి గ్రామానికి, ప్రతి నగరానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలనే సమిష్టి సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్ళాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. తెలంగాణతో పాటు రాజస్థాన్, ఛత్తీస్ గడ్ రాష్ట్రాలకు చెందిన డిసిసిల నియామకాల కోసం ఏఐసీసీ అత్యున్నత స్థాయి నేతలను పరిశీలకులుగా నియమించగా.. వీరికి రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తమ పార్టీ యొక్క ప్రజాకేంద్రీకృత వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తాము నిశ్చయించుకున్నామని, అట్టడుగు స్థాయిలో బలంగా ఉండటం, సేవ ద్వారా నడిపించబడటం, భారతదేశం కోసం తమ దార్శనికతలో ఐక్యంగా ముందుకెళ్ళడం, రాజ్యాంగాన్ని రక్షించే పనిలో దూసుకెళ్ళాలన్నారు. రాజీలేకుండా పార్టీని పరిరక్షించే వారిని, సమర్థులను సిఫార్సుచేయాలన్నారు. సమావేశంలో కేసీ వేణుగోపాల్ తో పాటు రాష్ట్రం నుండి పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

**టాప్ న్యూస్**

### కేటీఆర్ అరెస్టు తప్పదు

- పీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు



02

### గ్రూప్-1 ఉద్యోగం సాధించిన వారికి గుడ్ న్యూస్

- 27న సీఎం రేవంత్ చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్స్



02

### విగ్గు, పెగ్గు కాదు... సిగ్గుండాలి!

- బాలకృష్ణపై శ్యామల ఘాటు వ్యాఖ్యలు



02

SRI GOLD
TRUSTED GOLD BUYERS

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,14,440 |
| 22 క్యారెట్ | 1,04,900 |
| సిల్వర్ (కేజీ) | 1,40,000 |

# తెలంగాణలో 69 శాతం రిజర్వేషన్లు ఇస్తాం

## కరుణానిధిని స్ఫూర్తిగా తీసుకున్నాం

### తమిళనాడులోని సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం హార్ట్ టచింగ్

### తెలంగాణలో కూడా త్వరలో ప్రారంభిస్తాం.. చెన్నైలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**చెన్నై, మహా :**

మేం కరుణానిధిని స్ఫూర్తిగా తీసుకున్నాం.. మా రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం, 27 శాతం ఎస్సీ, ఎస్టీలకు, మొత్తంగా 69 శాతం రిజర్వేషన్లు ఇవ్వబోతున్నాం.. భారతీయులంతా తమిళనాడు విద్యా విధానంతో స్ఫూర్తి పొందారు.. దేశంలో మొట్టమొదటగా మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించింది తమిళనాడు రాష్ట్రమే.. తమిళనాడు అమలు చేస్తున్న విద్యా విధానం మాకు ప్రేరణ కలిగించింది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో విద్యలో ముందంజలో తమిళనాడు కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంత మంచి కార్యక్రమానికి నన్ను ఆహ్వానించినందుకు సంతోషంగా ఉంది. అన్నాదొరై, కరుణానిధి, కామరాజ్ వంటి గొప్ప యోధుల జన్మస్థలం తమిళనాడు అని అన్నారు. కరుణానిధి విజన్‌ను అమలు చేస్తున్న స్టాలిన్, ఉదయనిధిలను అభినందిస్తున్నానని తెలిపారు. ఇందిరాగాంధీ కామరాజ్ ప్లాన్‌ను తీసుకువచ్చారు.. కామరాజ్ తమిళనాడులో తీసుకువచ్చిన విద్యా విధానాన్ని దేశం అనుసరిస్తోంది.. ఈ కార్యక్రమం తమిళనాడు యువతకు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.. తమిళనాడు అవలంభిస్తున్న సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం హృదయాన్ని తాకుతుంది..


మిగతా 2లో



## ఎల్ అండ్ టీ ఎల్లిపో..

- హైదరాబాద్ మెట్రో మేం చూసుకుంటాం.. తేల్చేసిన రేవంత్ సర్కార్
- సీఎంతో చర్చల్లో ఏకాభిప్రాయం.. ఇక మెట్రో సర్కారుదే
- రూ.13వేల కోట్ల అప్పును టేకోవర్ చేసేందుకు సర్కార్ సిద్ధం
- ఎల్అండ్‌టీకి రూ.2,100 కోట్లు నగదు చెల్లించేందుకు సర్కారు డిసైడ్

02



## ఫ్రైడే ధమాకా

### ఒక్కరోజే ఓటీటీలో 22 సినిమాలు

**మహా :** ఈ ఫ్రైడే ఓటీటీలో ఏకంగా 22 సినిమాలు రిలీజవుతున్నాయి. వాటిలో ఘాటి, హృదయం పూర్వం, సుమతి వళవు చిత్రాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. జియోహాట్‌స్టార్ లో హృదయపూర్వం (మలయాళ మూవీ), అమెజాన్ ప్రైమ్ లో ఘాటి (తెలుగు మూవీ), మాదేవా (కన్నడ మూవీ), జీ5 లో జనావర్: ద బీస్ట్ విథిన్ (హిందీ సిరీస్), సుమతి వళవు (మలయాళ సినిమా) సినిమాలు ఉన్నాయి.



# చిరంజీవిపై రెచ్చిపోయిన బాలయ్య

## అసెంబ్లీ వేదికగా ఫైర్.. దుర్గేష్ పైనా సెటైర్లు

### వ్యంగ్య వ్యాఖ్యలపై చిరంజీవి కౌంటర్.. రాజకీయ, సినీవర్గాల్లో కలకలం

**విజయవాడ, మహా:**

అసెంబ్లీ వేదికగా.. అర్థంలేని చర్చలోకి హిందూపురం ఎమ్మెల్యే గా ఉన్న నందమూరి బాలకృష్ణ మెగాస్టార్ చిరంజీవిని లాగడంపై అటు రాజకీయ, ఇటు సినీవర్గాల్లో సంచలనంగా మారింది. 'కామినేని శ్రీనివాస్ చెప్పినట్లు చిరంజీవి గట్టిగా అడిగితే అప్పుడు ఈయన వచ్చాడు అన్నది అబద్ధం. గట్టిగా ఎవడు అడగలేదు అక్కడ. ఆయనంత గట్టిగా చెబితే ఈయన దిగొచ్చాడంట. లేకపోతే సినిమాటోగ్రఫీ మినిస్టరును కలవనన్నాడట' అంటూ నందమూరి బాలకృష్ణ ఏపీ అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ సైకోని కలిసేందుకు తనకు ఆహ్వానం వచ్చినా వెళ్లలేదన్నారు. చిరంజీవిని అవమానించారని అనడం వరకూ వాస్తవమే అని చెప్పిన బాలకృష్ణ.. కూటమి ప్రభుత్వంలోనూ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ తయారు చేసిన లిస్ట్ లో తనది 9వ పేరుగా ముద్రించారన్నారు.

మిగతా 2లో

**ఈరోజు చికెన్ ధరలు**

**1 కేజీ రిటైల్ ధర**

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 190 | 230 | 250 |

**హోల్ సేల్ ధర**

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 170 | 210 | 220 |

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 81,159.68 |
| నిఫ్టీ ↗ | 24,890.85 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.4 | 162 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.4 | 162 |
| రిటైల్ గుడ్డు ధర | 5.72 | 171.72 |

## బీజేపీ ఫోబియా పట్టుకుంది

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విసుర్లు
- మెట్రో విస్తరణను కేంద్రం ఆపడం లేదు
- రూ.30 వేల కోట్లతో నూతన జాతీయ రహదారులు
- రూ.1082 కోట్లతో కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి



**ఢిల్లీ, మహా :** హైదరాబాద్‌లో మెట్రో విస్తరణను కేంద్రం ఆపడం లేదని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని కలిశారు. ఈ మేరకు తెలంగాణలో జాతీయ రహదారుల ప్రాజెక్టుల అభివృద్ధి గురించి చర్చించారు. రాష్ట్రంలో కనెక్టివిటీని మెరుగుపరచడం, ప్రాజెక్టుల విస్తరణ పై చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలోనే ఆయన న్యూ ఢిల్లీలోని బీజేపీ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులు అత్యంత వేగవంతంగా సమర్థవంతంగా పురోగతి సాధిస్తున్నట్లు తెలిపారు.

మిగతా 2లో



## మళ్లీ కారెక్కిన కోనప్ప

- కేటీఆర్, హరీశ్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి..
- ఆర్ఎస్పీ చేరికతో దూరం.. ఏడాదిలోనే..
- గులాబీ తీర్థం పుచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే

**హైదరాబాద్:** సిర్పూర్ కాగజ్ నగర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీ చేసి ఓటమి పాలైన కోనప్ప.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ చేరిన తర్వాత పార్టీకి దూరమయ్యారు.

మిగతా 2లో




## భారీ వర్షాలు.. హై అలర్ట్

రంగంలోకి సీఎం రేవంత్.. అత్యవసర సమీక్ష

02

## గ్రూపు 1 ఫలితాల్లో టాప్ ర్యాంకర్లు

### టాప్ 10లో ఆరుగురు మహిళలే..

వివరాలు 2లో



## కేటీఆర్ అరెస్టు తప్పదు

**పీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు**

**ఢిల్లీ, మహా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అరెస్టుపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈకార్ రేసు కేసులో కేటీఆర్ అరెస్టు తప్పదని అన్నారు. ఢిల్లీలో గురువారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన.. పలు కీలక అంశాలపై ముచ్చటించారు. ఫోన్ ట్యాపింగ్ చేసి కేసీఆర్, కేటీఆర్ ఎన్నికల్లో గెలిచారని విమర్శించారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విషయం ఏఐసీసీ పరిధిలో ఉందని సరైన సమయంలో సరైన నిర్ణయం అధిష్టానం తీసుకుంటుందన్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. డీసీసీల అంశంపై అక్టోబర్ 4వ తేదీన 22 మంది అబ్జర్వర్లు తెలంగాణలో పర్యటిస్తారని వెల్లడించారు.

## విగ్గు, పెగ్గు కాదు... సిగ్గుండాలి!

**బాలకృష్ణపై శ్యామల ఘాటు వ్యాఖ్యలు**

**విజయవాడ, మహా :** టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై వైసీపీ అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఉద్దేశించి "సైకో గాడు" అంటూ బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని హితవు పలికారు. "నెత్తిన విగ్గు, చేతిలో పెగ్గు ఉంటే సరిపోదు, ఒంటికి కొంచెం సిగ్గు కూడా ఉండాలి" అంటూ ఆమె తీవ్రంగా విమర్శించారు. రాజకీయాల్లో ఉన్నవారు మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని శ్యామల పేర్కొన్నారు. గతంలో బాలకృష్ణకు వైఎస్ కుటుంబం అండగా నిలిచిందని శ్యామల వెల్లడించారు. "మీ ఇంట్లో కాల్పుల ఘటన జరిగినప్పుడు, మిమ్మల్ని ఆ కేసు నుంచి కాపాడింది అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి గారు కాదా? ఆ విషయాన్ని ఇంత త్వరగా ఎలా మర్చిపోయారు?" అని ఆమె ప్రశ్నించారు. ఆపద సమయంలో ఆదుకున్న వారిని విమర్శించడం తగదని ఆమె అన్నారు.

## గ్రూప్-1 ఉద్యోగం సాధించిన వారికి గుడ్ న్యూస్

**27న సీఎం రేవంత్ చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్స్**

**హైదరాబాద్, మహా :** గ్రూప్ 1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీజీపీఎస్సీ బుధవారం రాత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. పరీక్షలో వచ్చిన మార్కుల మెరిట్, రిజర్వేషన్, రోస్టర్ ఆధారంగా ఎంపికైన వారి వివరాలు వెల్లడించింది. 563 పోస్టులకు గాను 562 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. ఈ విషయాన్ని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. న్యాయ వివాదం నేపథ్యంలో ఓ పోస్టును విత్ హెల్డ్‌లో పెట్టినట్టు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్ 1 అభ్యర్థులకు ఈనెల 27న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగానియామక పత్రాలు అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వెల్లడించారు. శనివారం సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నత అధికారులతో గురువారం సీఎస్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రూప్1 ద్వారా ఎంపికైన 562 మంది అభ్యర్థులకు అపాయింట్ మెంట్ ఆర్డర్లు అందజేయనున్నట్టు సిఎస్ తెలిపారు. ఈ గ్రూప్1 పోస్టుల కింద దాదాపు 18 శాఖలకు చెందిన ఉద్యోగాలు ఉన్నాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులందరినీ కూడా ఆహ్వానిస్తున్నట్టు సి.ఎస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం శుక్రవారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఈ కార్యక్రమానికి ఒక్కొక్క అభ్యర్థికి చెందిన ఇద్దరు కుటుంబ సభ్యులను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, రెవిన్యూ, హోం, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉండడంతో.. రెవిన్యూ, హోం, జిఎడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 ఏళ్లు సర్వీస్ లో ఉంటారు కాబట్టి.. వారికి ఉత్తేజకరమైన వాతావరణంలో నియామక పత్రాలు అందచేయాలని, ప్రభుత్వ సర్వీస్ పట్ల వారికి ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సబ్యసాచి ఘోష్, వికాస్ రాజ్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ జితేందర్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీకే శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 69 శాతం రిజర్వేషన్లను ఇస్తాం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలోనూ ఈ స్కీమ్‌ను వచ్చే ఏడాది నుంచి తెలంగాణలో ప్రారంభిస్తామని ప్రకటించారు. నాన్ ముదలవన్ (స్కిల్ డెవలప్ మెంట్) రూ.10 వేల ఉపకార వేతనం ప్రభుత్వ కళాశాలలకు వెళ్లే బాలురు, బాలికలకు ఇచ్చే ఈ స్కీమ్‌లు ఉండడం అదృష్టం.. తమిళనాడు పేదలకు అండగా సీఎం స్టాలిన్ ఉన్నారు.. ఎన్నో శతాబ్దాల నుంచి తమిళ, తెలుగు రాష్ట్రాలు, ప్రజల మధ్య సాంస్కృతిక, చారిత్రకపరమైన బలమైన సంబంధం ఉంది.. 1991 సరళీకరణ తర్వాత సరళీకృత ఆర్థిక విధానాలతో తమిళనాడులో మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగం అభివృద్ధి చెందింది..తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగాలు అభివృద్ధి చెందాయి.. సామాజిక న్యాయం అమలులో తమిళనాడుతెలంగాణ మధ్య సారూప్యతలున్నాయన్నారు.

**దక్షిణాదికి తమిళనాడు విద్యావిధానమే ఆదర్శం**

దక్షిణాదికి చెందిన కేరళ, కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు తమిళనాడు విద్యా విధానం ఆదర్శంగా నిలిచింది.. తెలంగాణలో మా ప్రభుత్వం, నేను విద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.. ముఖ్యమంత్రిగా ఉన్నా విద్యా శాఖను నా దగ్గరే ఉంచుకున్నా.. మా రాష్ట్రంలో నైపుణ్యత పెంచడానికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీని ప్రారంభించామన్నారు. తెలంగాణ నుంచి ప్రతి ఏటా 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు కళాశాలల నుంచి



బయటకు వస్తున్నారు.. నైపుణ్యలేమితో ఉద్యోగాలు దక్కకపోతుండడంతో వారి స్కిల్స్ పెంచి ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం..పీపీపీ విధానంలో ఈ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం.. దానికి ఛైర్మన్‌గా ఆనంద్ మహేంద్రను నియమించాం. కార్పొరేట్ సంస్థల అధిపతులను డైరెక్టర్లుగా నియమించామని సీఎం రేవంత్ తెలిపారు. తమిళనాడు సీఎం స్టాలిన్, డిప్యూటీ ఉదయనిధి, కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎల్ అండ్ టీ ఎల్లిపో..

హైదరాబాద్ మెట్రో మేం చూసుకుంటాం.. తేల్చేసిన రేవంత్ సర్కార్

సీఎంతో చర్చల్లో ఏకాభిప్రాయం.. ఇక మెట్రో సర్కారుదే

రూ.13వేల కోట్ల అప్పును టేకోవర్ చేసేందుకు సర్కార్ సిద్ధం

ఎల్అండ్‌టీకి రూ.2,100 కోట్లు నగదు చెల్లించేందుకు సర్కారు డిసైడ్

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1ను రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోనుంది. ఈ క్రమంలోనే ఎల్‌టీఎంఆర్‌హెచ్‌ఎల్‌కు ఉన్న రూ. 13,000 కోట్ల రుణాన్ని ప్రభుత్వం స్వాధీనం చేయనుంది. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ 1 వ్యవస్థను ప్రభుత్వానికి అప్పగించడానికి ఎల్ అండ్ టీ సంసిద్ధతను వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. మూడు కారిడార్లలో విస్తరించి ఉన్న 69.2 కి.మీ. నెట్‌వర్క్‌ను కేంద్రం లేదా రాష్ట్రం స్వాధీనం చేసుకోవాలని కోరుతూ కంపెనీ ఇటీవల కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ఎల్ అండ్ టీ ఒక లేఖను కూడా రాసింది. ఈ క్రమంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సీనియర్ అధికారులతో కలిసి ఎల్ అండ్ టీ గ్రూప్ సీఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్, సంస్థ సీనియర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందుకు సంబంధించి ముందుకు సాగే మార్గం గురించి చర్చించారు.

**నిర్వహించే పరిస్థితి ఇక లేదు..**

హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1ను టేకోవర్ చేసుకోను



న్న తెలంగాణ సర్కార్... ఎల్ అండ్ టీకి ఈక్విటీ సెటిల్‌మెంట్‌గా రూ. 2,000 (వన్ టైమ్) కోట్లు చెల్లించనున్నట్టుగా సమాచారం. దీంతో హైదరాబాద్ మెట్రో రైలు నిర్వహణ నుంచి ఆ సంస్థ వైదొలగనుంది. అయితే ఈ ప్రక్రియ కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 విస్తరణను ప్రాసెస్ చేయడానికి మార్గం సుగమం చేస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే... హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2లో ఈక్విటీ భాగస్వామిగా పాల్గొనడానికి నిరాకరించిన సంగతి తెలిసిందే. అలాగే అప్పుల భారం పెరుగుతోందని, హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1ను తాము నిర్వహించే పరిస్థితి ఇక లేదని స్పష్టం చేసింది. మెట్రో మొదటి దశలోని తమ ఈక్విటీ వాటాను కేంద్రం లేదా రాష్ట్రానికి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. ఈ క్రమంలోనే హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ మొదటి దశను ఎల్ అండ్ ీగ్రూప్ నుండి స్వాధీనం చేసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది.

## గ్రూపు 1 ఫలితాల్లో టాప్ ర్యాంకర్లు

**టాప్ -10లో ఆరుగురు మహిళలే**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ గ్రూప్ 1 ఫలితాల్లో పురుషులకు ఏ మాత్రం తీసిపోకుండా మహిళలు తగ్గేదెలే అంటూ దూసుకుపోయారు. జనరల్ మెరిట్ ర్యాంకు జాబితాలో తొలి 10 ర్యాంకుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. టాప్50 ర్యాంకుల్లో 25 మంది మహిళలు, వంద ర్యాంకుల్లో 41 మంది మహిళలు ఉన్నారు. గ్రూప్1 ప్రధాన పరీక్షల్లో 500పైగా మార్కులు సాధించిన అభ్యర్థులు 52 మంది ఉన్నారు. టాప్3 ర్యాంకర్‌తోపాటు టాప్100లో ఐదుగురు తెలంగాణ స్థానికేతర అభ్యర్థులు ప్రతిభ చాటారు. గ్రూప్1 ప్రధాన పరీక్షల్లో అభ్యర్థులు సాధించిన మార్కులతో టీజీపీఎస్సీ జనరల్ ర్యాంకు జాబితాజీఆర్ఎల్ ప్రకటించింది.

**డాక్టర్ లక్ష్మీ దీపిక కొమ్మిరెడ్డి**

కాగా హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ లక్ష్మీ దీపిక కొమ్మిరెడ్డి రాష్ట్రంలో గ్రూపు 1 మొదటి ర్యాంక్ సాధించారు. మెయిన్స్ పరీక్షల్లో 900 మార్కులకు గాను లక్ష్మీ దీపిక 550 మార్కులు సాధించి టాప్‌గా నిలిచారు. ఉస్మానియాలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన లక్ష్మీ దీపిక గతంలోనే ఎంపీడీవో గా కూడా సెలెక్టయ్యారు. రెండు సార్లు యూపీఎస్సీ ఇంటర్వ్యూకు కూడా సెలెక్టయ్యారు.

లక్ష్మీదీపిక తండ్రి కృష్ణకొమ్మిరెడ్డి సీనియర్ ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైరయ్యారు. తల్లి పద్మావతి గృహిణి. తల్లిదండ్రులకు లక్ష్మీదీపిక ఏకైక సంతానం. పది వరకూ సఫిల్‌గూడలోని డీఏవీ స్కూల్లో చదివిన లక్ష్మీ దీపిక 2013 మెడిసిన్‌లో 119వర్యాంకు సాధించి ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ పూర్తిచేశారు. మొదట అమెరికా వెళ్లి మాస్టర్స్ చేయాలని భావించినప్పటికీ 'యూపీఎస్సీ' మెరుగైన ఎంపిక అనుకుని అటుగా నడిచారు. ఎక్కడా శిక్షణ కూడా తీసుకోకుండా సొంత ప్రిపరేషన్ సాగించారు. 2020, 2021,2023లలో సరైన మార్కులు సాధించలేకపోయారు.2024లో సొంతంగా చదివి రాష్ట్రస్థాయిలోనే ఫస్ట్‌ర్యాంకు సాధించారు.

**దాడి వెంకటరమణ**

గ్రూపు 1లో రెండో ర్యాంక్ సాధించిన దాడి వెంకటరమణది నల్గొండ జిల్లా. గ్రూపు 1లో 535.5 మార్కులతో రెండో ర్యాంకు సాధించారు. ఆరేండ్లుగా సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేరవుతున్న వెంకటరమణ.. గ్రూప్1



ఫస్ట్ అటెంప్ట్ లోనే సత్తా చాటాడు, ఇటీవల టీజీపీఎస్సీ ప్రకటించిన జూనియర్ లెక్చరర్ సివిక్స్ పోస్టుకు, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుకు కూడా ఎంపికయ్యారు. అంతేకాక గ్రూప్2లో 378వ ర్యాంకు సాధించారు. అయితే ఆయన ఆర్డీవో పోస్టును ఎంచుకున్నారు.

**తేజస్వినిరెడ్డి**

మల్టీ జోన్1 కేటగిరీలో టాపర్‌గా హన్మకొండ జిల్లాకు చెందిన తేజస్వినిరెడ్డి (532.5 మార్కులు) నిలిచారు. మొత్తం మీద నాలుగో ర్యాంకు సాధించారు. ఆమె ప్రస్తుతం మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ గ్రూపు 1 సాధించి ఆర్డీవోగా సెలక్ట్ అయ్యారు.

**సిద్ధాల కృతిక**

రంగారెడ్డి జిల్లా మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడకు చెందిన సిద్ధాల కృతిక గ్రూపు 1లో ఐదవ ర్యాంక్ సాధించారు. 532 మార్కులతో రాష్ట్రస్థాయిలో ఈ ర్యాంకు సాధించారు. నాలుగు సార్లు సివిల్స్ కు ప్రయత్నించిన కృతికకు గతంలో మంచి ర్యాంకు రాలేదు. ఇటీవల నిర్వహించిన గ్రూప్4లో 511వ ర్యాంకు సాధించిన కృతిక వాణిజ్య పన్నుల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. తాజాగా గ్రూప్1లో రాష్ట్రస్థాయి ఐదో ర్యాంకు సాధించడంతో ఆర్డీవోగా చేరనున్నారు.

**పూనాటి హర్షవర్ధన్**

నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన పూనాటి హర్షవర్ధన్ గ్రూప్1లో రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు, మల్టీ జోన్2 స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించాడు. హర్ష వర్ధన్ బిట్స్ పిలానీ లో ఇంజనీరింగ్ చదివారు, ఆయన రూ.27 లక్షల వార్షిక వేతనంతో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేశారు. ఉద్యోగం మానేసి సివిల్స్‌కు ప్రిపేరవుతున్నాడు. ప్రస్తుతం ఆయన ఆర్డీవోగా విధుల్లో చేరనున్నారు.

## మళ్లీ కారెక్కిన కోనప్ప

- కేటీఆర్, హరీశ్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి..
- ఆర్ఎస్పీ చేరికతో దూరం.. ఏడాదిలోనే..
- గులాబీ తీర్థం పుచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే

(మొదటిపేజీ తరువాయి)

గత కొంతకాలంగా ఆయన కేసీఆర్‌కు అనుకూలంగా ప్రకటనలు చేస్తుండటంతో తిరిగి పార్టీలోకి వస్తారని ప్రచారం జరిగింది. అందరూ ఊహించినట్లుగానే.. ఎర్రవల్లిలో గురువారం ఆయన గులాబీ కండువా కప్పుకొన్నారు. కోనప్పతో పాటు ఆయన సోదరుడు కృష్ణ కూడా పార్టీలో చేరారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

### ఏడాదిలోనే..

గత ఏడాది రేవంత్ రెడ్డి సమక్షంలో గులాబీ పార్టీని వదిలి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న కోనేరు కోనప్ప.. ఏడాది కూడా పూర్తికాకముందే హస్తం దోస్తీకి కటీఫ్ చెప్పారు. కాగా.. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కోనేరు కోనప్ప.. ఆ పార్టీకి గుడ్ బై చెప్పి తన నియోజకవర్గంలో స్వతంత్ర నేతగా కొనసాగుతారని ప్రకటించారు. ఇప్పుడు ఆయన కారు పార్టీలో చేరడంతో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వస్తున్న సందర్భంలో బీఆర్ఎస్ పార్టీ మీద కానీ, కేసీఆర్‌ను తాను ఎప్పుడూ విమర్శించలేదని కోనప్ప చెప్పడంతో ఆయన ఖచ్చితంగా కారు పార్టీలోనే చేరుతారని పలువురు భావించారు. అందరూ అనుకున్నట్లుగానే ఆయన బీఆర్ఎస్‌లో చేరారు.



# చిరంజీవిపై రెచ్చిపోయిన బాలయ్య

(మొదటిపేజీ తరువాయి)

'ఎవడాడు ఇలా రాసిందని ఆ రోజే తాను సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ని నిలదీశానని బాలకృష్ణ చెప్పుకొచ్చారు.

**చిరంజీవి సంచలన కౌంటర్**

ఏపీ అసెంబ్లీలో శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్, నందమూరి బాలకృష్ణ తన పేరును ప్రస్తావిస్తూ మాట్లాడటంపై అగ్ర కథానాయకుడు చిరంజీవి స్పందించారు. 'కామినేని శ్రీనివాస్ చెప్పినట్లు చిరంజీవి గట్టిగా అడిగితే అప్పుడు ఈయన వచ్చాడు అన్నది అబద్ధం. గట్టిగా ఎవడు అడగలేదు అక్కడ. ఆయనంత గట్టిగా చెబితే ఈయన దిగొచ్చాడంట. లేకపోతే సినిమాటోగ్రఫీ మినిస్టరును కలవనన్నాడట' అంటూ ఒకింత వ్యంగ్యంగా చెప్పడాన్ని నేను టీవీ చానల్‌లో లైవ్‌లో చూశాను. దీనిపై ప్రజలకు వివరణ ఇవ్వాలనుకుంటున్నా అంటూ రెండున్నరేళ్ల క్రితం సినిమా పరిశ్రమ సమస్యలపై అప్పటి సీఎం వైఎస్ జగన్ కలిసినప్పటి పరిస్థితులను చెబుతూ చిరంజీవి ఓ ప్రకటన విడుదల చేశారు. 'బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడిన మాటలను టీవీలో లైవ్‌లో చూశా. ఏపీలో జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పరిశ్రమలోని దర్శకనిర్మాతలు కొందరు నన్ను కలిశారు. టికెట్ ధరల పెంపుపై ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. ఈ విషయమై అప్పటి సినిమాటోగ్రఫీ మంత్రి పేర్నినానితో ఫోన్‌లో మాట్లాడాను. ముఖ్యమంత్రి మీతో వన్ టు వన్ మాట్లాడతానని, భోజనానికి రావాలని సీఎం చెప్పారంటూ నాని నాతో చెప్పారు. దానికి టైమ్ కూడా ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు నేను ఆయన నివాసానికి వెళ్లాను. ఁభోజనం చేస్తున్న సమయంలో సినీ పరిశ్రమ ఇబ్బందులు సీఎంకు వివరించా. ఇండస్ట్రీకి మీకు మధ్య గ్యాప్ ఉందని అందరూ అనుకుంటున్నారని సీఎంకు చెప్పా. సమయం ఇస్తే అందరం కలిసి వస్తామని కోరాను. కొన్ని రోజుల తర్వాత పేర్ని నాని ఫోన్ చేసి 'కొవిడ్ రెండో దశ కారణంగా ఐదుగుర్ని మాత్రమే రమ్మన్నారు' అని చెప్పారు. అప్పుడు నేను బాలకృష్ణ గారిని ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించాను. ఆయన అందుబాటులోకి రాలేదు. జెమిని కిరణ్‌ను వెళ్లి బాలకృష్ణను కలవమని చెప్పా. ఆయన మూడు సార్లు ప్రయత్నించినా బాలకృష్ణను కలవలేకపోయారు. ప్రత్యేక విమానం ఏర్పాటు చేసి ఆర్.నారాయణ మూర్తితో సహా దర్శకనిర్మాతలు, హీరోలు సీఎంను కలిశాం. సీఎంతో సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని వివరించాను. సినీ పరిశ్రమకు ప్రభుత్వ సహకారం అందించాలని కోరాం. అప్పుడు అక్కడున్న వారందరూ సాక్ష్యమే. నేను చొరవ తీసుకోవడం వల్లే ప్రభుత్వం టికెట్ల ధరల పెంపునకు అంగీకరించింది. ప్రభుత్వ నిర్ణయం సినీ పరిశ్రమకు ఎంతో కొంత మేలు చేసింది. 'వీరసింహా రెడ్డి', 'వాల్తేరు వీరయ్య' చిత్రాలకు టికెట్ ధరలు పెరిగాయి. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్లు లాభం చేకూరింది. ముఖ్యమంత్రితో నైనా, సామాన్యుడితో నైనా సహజ సిద్ధమైన ధోరణిలో మాట్లాడుతా. పరస్పరం గౌరవం ఇచ్చిపుచ్చుకునే విధానంలోనే మాట్లాడతా. ప్రస్తుతం నేను ఇండియాలో నేను కనుక పత్రికా ప్రకటన ద్వారా జరిగిన దాన్ని అందరికీ తెలియచేస్తున్నాను' అని పేర్కొన్నారు.

## బీజేపీ ఫోబియా పట్టుకుంది

(మొదటిపేజీ తరువాయి)

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2015 వరకు రాష్ట్రంలో 2500 కిలో మీటర్ల జాతీయ రహదారులు ఉండేవని తెలిపారు. ఈ పదేళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణం డబుల్ అయిందని, సుమారు 5 వేల కిలోమీటర్లకు పైగా ఇప్పటికే పూర్తి అయిందని చెప్పారు. దేశ అభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర చాలా కీలకం గా ఉందన్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలలో నేషనల్ హైవేలకు అనుసంధానం జరుగుతోందని, 31 జిల్లాలలో పూర్తి కూడా అయినట్లు క్లారిటీ ఇచ్చారు. దీంతో తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా హైవేలపై రోడ్ సేఫ్టీ పెరిగిందన్నారు. నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి సుమారు రూ.30 వేల కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఇందులో కరీంనగర్‌లో మహదేవ్ పూర్ నుంచి సిరోచ వరకు 17 కిలోమీటర్ల రోడ్డు రూ.163 కోట్లతో చేపట్టనున్నట్లు తెలిపారు. నల్గొండలో గౌరెల్లి నుంచి వలిగొండ వరకు 42 కిలోమీటర్ల రోడ్డు రూ.690 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే నకిరేకల్ నుంచి నాగార్జున సాగర్ వరకు 14 కిలోమీటర్ల రోడ్డు రూ.516 కోట్లతో నిర్మాణం, తెలంగాణ ఏపీకి అనుసందానం చేసే కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి సుమారు రూ.1082 కోట్లతో బ్రిడ్జి రానున్నట్లు చెప్పారు. ఈ బ్రిడ్జికి కనెక్టివిటీ కోసం రూ.430 కోట్లతో 13 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం మంజూరు అయిందని తెలిపారు. వరంగల్ తొర్రూర్ నుంచి నెహ్రూ నగర్ వరకు రూ.674 కోట్లతో 69 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇలా రాష్ట్రంలో రానున్న రోజుల్లో హైవేల నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి చెప్పినట్లు వెల్లడించారు.

**తెలంగాణ మేలు కోరుకునే వ్యక్తుల్లో నేను ముందుంటా...**

27 ప్రాజెక్టులు డీపీఆర్ స్టేజీలో ఉన్నాయని అన్నారు. తెలంగాణ మేలు కోరుకునే వ్యక్తుల్లో నేను ముందుంటా అని సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఆధారాలు లేకుండా అర్థం లేని వ్యాఖ్యలు మాట్లాడొద్దని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కి బీజేపీ ఫోబియా పట్టుకుందని విమర్శించారు. నేపాల్‌లో జరిగిన హింస భారత్‌లో జరుగుతుందని, కేటీఆర్ వ్యాఖ్యానించడం దేశద్రోహమే అని కిషన్‌రెడ్డి తప్పుబట్టారు.

## భారీ వర్షాలు.. హై అలర్ట్

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో రానున్న రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలపై నిరంతరం మానిటర్ చేయాలని సూచించారు. మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని, నిరంతరం జాగ్రత్తగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు హై అలెర్ట్‌గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని కోరారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అన్ని కాజ్‌వేలను పరిశీలించాలని, రోడ్లపై వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగానే ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలన్నారు. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వేలాడే వైర్లను తొలగించటంతో పాటు, ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా చూడాలన్నారు. దసరా సెలవులు ఉన్నప్పటికీ విద్యా సంస్థలు కూడా వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హైడ్రాతోపాటు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆకాశానికి చిల్లు పడిందా అన్న రేంజ్‌లో వర్షాలు పడుతున్నాయి. సాయంత్రం నుంచి మొదలవుతున్న వర్షం అర్ధరాత్రి 12 గంటల వరకు నాన్‌స్టాప్‌గా కురుస్తోంది. పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, సిద్దిపేట, ములుగు, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జనగామ జిల్లాల్లో రాబోయే 24 గంటల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షం పడే అవకాశం ఉందని వివరించారు. ఆదిలాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, సూర్యాపేట జిల్లాలో మోస్తారు నుంచి భారీ వర్షాలు పడతాయని వివరించారు. హైదరాబాద్ లో సాయంత్రం, రాత్రి వేళల్లో తేలికపాటి వర్షం పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



# స్మితా సభర్వాల్‌కు హైకోర్టులో రిలీఫ్

**ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని ఆదేశం**

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం అంశంలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్‌కు హైకోర్టులో ఊరట లభించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకోవద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. కాళేశ్వరం అంశంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను స్మితా సభర్వాల్ హైకోర్టులో సవాల్ చేశారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని సవాల్ చేసిన ఆమె.. ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నివేదిక ఆధారంగా తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా స్మితా సభర్వాల్‌పై చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది.

# ఆర్టీసీ బస్సెక్కితే బహుమతులు

**దసరాకు లక్కీ డ్రా నిర్వహణ.. రూ.5.50 లక్షల విలువగల బహుమతులు గెలుచుకునే అవకాశం**

**హైఎండ్ బస్సుల్లో ప్రయాణించే వారికే బహుమతులు**

**హైదరాబాద్, మహా :** దసరా పండుగ నేపథ్యంలో సంస్థ బస్సుల్లో ప్రయాణించేవారికి లక్కీ డ్రా నిర్వహించాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. ఈ లక్కీ డ్రాలో రీజియన్ కి ముగ్గురు చొప్పున 33 మందికి రూ.5.50 లక్షల విలువగల బహుమతులను సంస్థ అందజేయనుంది. ఒక్కో రీజియన్ కు ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలను సంస్థ ప్రకటించింది. ఈ లక్కీ డ్రా లో పాల్గొనాలంటే ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు టీజీఎస్ఆర్టీసీకి చెందిన హైఎండ్ బస్సులైన సెమీ డీలక్స్, మెట్రో డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీతో పాటు అన్ని రకాల ఏసీ బస్సుల్లో ప్రయాణించిన వారే అర్హులు. ఈ సర్వీసుల్లో ఎక్కిన ప్రయాణికులు తమ ప్రయాణం పూర్తయిన తర్వాత టికెట్ పై తమ పూర్తి పేరు, ఫోన్ నెంబరు రాసి బస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్ ల్లో వేయాల్సి ఉంటుంది. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6




వరకు చేసిన ప్రయాణాలను మాత్రమే లక్కీ డ్రాకి సంస్థ పరిగణనలోకి తీసుకుంటుంది. ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు ఈ లక్కీ డ్రాలో పాల్గొనవచ్చు. లక్కీ డ్రా అనంతరం డ్రాప్ బాక్స్ లను సంబంధిత ఆర్ఎం కార్యాలయాలకు చేర్చి ప్రతి రీజియన్ పరిధిలో లక్కీ డ్రా నిర్వహించి ముగ్గురి చొప్పున విజేతలను అక్టోబర్ 8న అధికారులు ఎంపికచేస్తారు. లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేసి సంస్థ ఘనంగా సన్మానిస్తుంది. దసరా లక్కీ డ్రాలో ప్రయాణికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ కోరారు. లక్కీ డ్రాకు సంబంధించిన పూర్తి వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 04069440000, 04023450033 తో పాటు స్థానిక డిపో మేనేజర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారికి ఇబ్బందులు కలగకుండా టీజీఎస్ఆర్టీసీ పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని, ప్రయాణికుల సౌకర్యార్థం 7754 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్నీ ప్రత్యేక బస్సులను నడపాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు.

# జగన్ ఒక సైకో

**అసెంబ్లీలో బాలకృష్ణ సంచలన వ్యాఖ్యలు**

**చిరంజీవికి అవమానం జరిగిందనేది వాస్తవమే అంటూ కామెంట్**

**అమరావతి, మహా:** అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మాజీ సీఎం జగన్ పాలనలో సినీ ప్రముఖులకు జరిగిన అవమానంపై బాలకృష్ణ స్పష్టమైన స్పందన ఇచ్చారు. అసెంబ్లీలో చర్చ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ, "జగన్ హయాంలో సినీ ప్రముఖులకు అవమానం జరిగింది. ఆ రోజు సినీ ప్రముఖులను జగన్ కలవడానికి ఇష్టపడలేదు. చివరికి చిరంజీవి గట్టిగా అడిగాకే ఆయన కలిశారు" అని వ్యాఖ్యానించారు. ఏ తప్పు జరుగుతున్నా, అసెంబ్లీకి స్పష్టత ఇవ్వాలనే.. ఈ వ్యాఖ్యలకు బాలకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ "ఆ రోజు గట్టిగా అడిగిన వారెవ్వరూ లేరు. నిజానికి ఆ సైకో గాడిని కలవడానికి నాకు కూడా ఆహ్వానం వచ్చింది. కానీ నేను వెళ్లలేదు. చిరంజీవికి అవమానం జరిగిందనేది మాత్రం వాస్తవమే" అని అన్నారు. నందమూరిబాలకృష్ణ మాట్లాడుతూ "ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఫిలిం డెవలప్



మెంట్ కార్పొరేషన్‌లో నా పేరు తొమ్మిదో స్థానంలో ముద్రించారు. అది చూసిన వెంటనే నేను అభ్యంతరం వ్యక్తం చేశాను. ఎవరు ఈ విధంగా రాశారో కూడా ప్రశ్నించాను. ఏ తప్పు జరుగుతున్నా, అసెంబ్లీకి స్పష్టత ఇవ్వాలనే నేను స్పందించాను" అని తెలిపారు. అసెంబ్లీలో తన వ్యాఖ్యలను అపార్థం చేసుకోకూడదనే ఉద్దేశంతో "ఏదైనా తప్పుగా మాట్లాడి ఉంటే క్షమించండి. నా ఉద్దేశం స్పష్టత ఇవ్వడం మాత్రమే" అని బాలకృష్ణ సభను కోరారు.

# మరో భారీ ఆవిష్కరణకు హైదరాబాద్ సిద్ధం

- **టీ-వర్క్స్ వేదికగా యుద్ధ విమానాల ఫ్లైట్ సిమ్యులేటర్**
- **వచ్చే మూడేళ్లలో ఐదు సిమ్యులేటర్లను సరఫరా చేయడానికి ఒప్పందాలు**

**హైదరాబాద్, మహా:** డ్రోన్లు, క్షిపణులు, విమానాల విడిభాగాలు, రక్షణరంగ ఉత్పత్తులతో దేశం దృష్టిని ఆకర్షిస్తున్న హైదరాబాద్ మరో భారీ ఆవిష్కరణకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో టీవర్క్స్ వేదికగా యుద్ధ విమానాల ఫ్లైట్ సిమ్యులేటర్ రూపుదిద్దుకుంటోంది. ఎయిర్ ఫోర్స్, నేవీ యుద్ధ విమానాల పైలట్ల శిక్షణ కోసం అవసరమయ్యే సిమ్యులేటర్లను ఇప్పటి దాకా భారీ వ్యయంతో అమెరికా, యూరప్ ల నుంచి దిగుమతి చేసుకుంటుండగా, ఇకపై ఆ అవసరం ఉండదు. పైగా మనమే అగ్రదేశాలకు ఎగుమతి చేయగలిగే సాంకేతికత వృద్ధి చెందుతుంది. 'యాక్సియల్ ఏరో ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థ ఈ సిమ్యులేటర్ల తయారీకి అన్ని అనుమతులు సాధించి, వాణిజ్య ఉత్పత్తి మొదలు పెట్టింది. వచ్చే మూడేళ్లలో ఐదు సిమ్యులేటర్లను సరఫరా చేయడానికి రక్షణ మంత్రిత్వ శాఖ నెలకొల్పిన 'ఇన్నోవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్సలెన్స్'తో భారీ ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రస్తుతం మన ఎయిర్ ఫోర్స్ దిగుమతి చేసుకుంటున్న ఒక్కో ఫైటర్ జెట్ సిమ్యులేటర్ వ్యయం రూ.50 కోట్ల దాకా ఉండగా, యాక్సియల్ ఏరో రూ.2530 కోట్లకే అందజేస్తుంది. భవిష్యత్తులో ఫ్లైట్ సిమ్యులేటర్ల ఉత్పత్తి కేంద్రంగా.. టీవర్క్స్ లో పరిశోధనలు సాగిస్తున్న ఈ సంస్థ ఎయిర్ ఫోర్స్, నేవీ అవసరాలకు తగిన విధంగా ఫ్లైట్ సిమ్యులేటర్లను తయారు చేయడానికి సర్వం సిద్ధం చేసుకుంది. ఇటీవల టీవర్క్స్ ను సందర్శించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దాదాపు రెండు గంటల సేపు పరిశోధనల పురోగతిని పరిశీలించి, ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. తక్కువ సమయంలో క్లిష్టమైన పరిశోధనలను పూర్తి చేసి ఆర్డర్లు సాధించినందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు. యాక్సియల్ ఏరో రూపొందిస్తున్న సిమ్యులేటర్లు 360 డిగ్రీల మేర తిరుగగలిగే స్టివార్టు ప్లాట్ ఫామ్ ను కలిగి ఉంటాయి. దీనివల్ల యుద్ధ క్షేత్రంలో శత్రువుకు దొరకకుండా తప్పించుకునేందుకు ఫైటర్ జెట్లను నడిపించే పైలట్లు అనుసరించే విన్యాసాలన్నీ ఇందులో సాధ్యమవుతాయి. సిమ్యులేటర్ల వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమైతే విడిభాగాలు అందించే అనుబంధ పరిశ్రమలు పుట్టుకొస్తాయి. ఎంఎస్ ఎంఇ రంగం కూడా ప్రయోజనం పొందుతుంది.

# స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయండి

**దేశాభివృద్ధికి పాటుపడండి**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు**

**కరీంనగర్, మహా :** స్వదేశీ వస్తువులనే వాడాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. మన దేశంలో తయారు చేసిన వస్తువులు కొనుగోలు చేయడం ద్వారా స్థానిక కంపెనీలు, చిన్నతరహా వ్యాపారాలు బలపడతాయని, ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, డబ్బు దేశంలోనే చలామణి అవుతుందని పేర్కొన్నారు. స్వయం సమృద్ధి చెందిన దేశంగా (ఆత్మ నిర్భర భారత్) అభివృద్ధి చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సంపూర్ణ మద్దతివ్వాలని కోరారు. జీఎస్టీ సంస్కరణల ఫలితంగా 'స్వరాజ్ సంస్థ' ట్రాక్టర్ ధర రూ.40 వేల నుండి రూ.80 వేల వరకు తగ్గిన నేపథ్యంలో పలువురు రైతులు వాటిని కొనుగోలు చేశారు. స్వరాజ్ ట్రాక్టర్స్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు ఆయా ట్రాక్టర్లను కేంద్ర మంత్రి చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఆయా రైతులతో, డీలర్స్ తో మాట్లాడి ఒక్కో ట్రాక్టర్ పై ఎంత ధర తగ్గిందని ఆరా తీశారు. జీఎస్టీ సంస్కరణలవల్ల తాను కొన్న ట్రాక్టర్ ధర రూ.10 లక్షల 50 వేలు ఉండగా, ప్రస్తుతం రూ. 9 లక్షల 80 వేలకే వచ్చిందని తద్వారా రూ.70 వేలు ఆదా అయ్యాయని మక్కపల్లికి చెందిన రైతు అఖిల్ చెప్పారు. మానకొండూరు మండలం లింగాపూర్ కు చెందిన అనిల్ కుమార్ అనే రైతు మాట్లాడుతూ జీఎస్టీ వల్ల తనకు రూ. 50 వేలు ఆదా అయ్యిందన్నారు. నుస్తులాపూర్ కు చెందిన వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ తాను ట్రాక్టర్ కొనడం వల్ల రూ.50 వేలు ఆదా అయ్యిందన్నారు. స్వరాజ్ ట్రాక్టర్ డీలర్ వెంకట్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో స్వరాజ్ కు చెందిన వివిధ రకాల ట్రాక్టర్లు ఒక్కో దానిపై సగటున రూ.40 నుండి రూ.80 వేలదాకా తగ్గింపు జరిగిందన్నారు. తద్వారా ట్రాక్టర్స్ సేల్స్ బాగా పెరిగాయని, రైతులు కూడా చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారంతా కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ జీఎస్టీవల్ల కలుగుతున్న ప్రయోజనాలను మీ చుట్టుపక్కలనున్న వారందరికీ వివరించాలని వారిని కోరారు.


# గురుకుల ఖాళీలపై హైకోర్టు కీలక తీర్పు

**మిగిలిన పోస్టులను పిటిషనర్లతో భర్తీ చేయాలని ఆదేశం**

**కోర్టు తీర్పుపై పిటిషనర్ల హర్షం**

**హైదరాబాద్, మహా :** గురుకుల నియామకాల భర్తీకి సంబంధించి హైకోర్టు లో నమోదైన పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. గురుకుల నియామక ప్రక్రియలో మిగిలిన ఖాళీలను పిటిషనర్లతో భర్తీ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 6 నెలల్లోగా ఈ భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. కోర్టు తీర్పు వల్ల పిటిషనర్లకు ఉద్యోగం లభించే అవకాశం దక్కింది. దీనిపై పిటిషనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం అనగా 2023లో తెలంగాణ గురుకుల నియామక సంస్థ 9 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అవరోహణ క్రమాన్ని పాటించలేదు. అలానే మెరిట్ ఉన్న క్యాండిడేట్స్‌కు మెరుగైన పోస్టులు వచ్చాయి. దీంతో నియామక ప్రక్రియలో సమస్యలు తలెత్తాయి. అలానే చాలా పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. అయితే ఈ ఖాళీ పోస్టులను మెరిట్ జాబితాలో తర్వాత స్థానంలో ఉన్న అర్హులైన అభ్యర్థులకు కేటాయించాలని కోరుతూ.. కొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు. తాజాగా ఈ పిటిషన్లను విచారించిన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. ఖాళీ ఉన్న పోస్టులను తర్వాత మెరిట్ వారితో అనగా పిటిషనర్లతో భర్తీ చేయాలని హైకోర్టు తెలిపింది. ఈమొత్తం ప్రక్రియ ఆరు నెలల్లోగా ముగిసేలా చూడాలని అధికారులను ఆదేశించింది.

ఇదిలా ఉంటే గురుకుల విద్యాసంస్థల్లో ఖాళీలను నేరుగా భర్తీ చేసినప్పటికి.. ఇంకా సిబ్బంది కొరత ఉంది. మరీ ముఖ్యంగా మైనారిటీ గురుకుల విద్యా సంస్థల్లో. ఈక్రమంలో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీ గురుకులాల్లో ఖాళీగా ఉన్న 3,488



ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. వీటిని ఔట్ సోర్సింగ్ ప్రక్రియ ద్వారా భర్తీ చేయనున్నారు. దీనికి ఆర్థిక శాఖ కూడా ఆమోదం తెలిపింది. గురుకుల విద్యా సంస్థల నియామక బోర్డు 9 వేల పైచిలుకు గురుకుల పోస్టుల భర్తీకి 2023, ఏప్రిల్ 6న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలకు దాదాపు 2.63 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పరీక్షలను ఆన్‌లైన్‌లోనే నిర్వహించారు. రాష్ట్రంలోని 17 జిల్లాల్లోని 104 కేంద్రాల్లో గురుకుల పరీక్ష నిర్వహించారు. ప్రతి రోజు మూడు షిఫ్టుల్లో అభ్యర్థులకు పరీక్ష నిర్వహించారు. ఆ తర్వాత ఫలితాలు వెల్లడించారు. అయితే ఈ నోటిఫికేషన్‌లో భారీగా పోస్టులు మిగలడం వల్ల.. కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా వారికి ఊరట లభించింది.



# భూ హక్కులకు మొదటి ప్రాధాన్యం

- ప్రాజెక్టులో భూములు కోల్పోయే రైతుల బాధను సున్నితంగా పరిగణిస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం, మహా:** ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్ట్ పరిధిలో భూములు కోల్పోయే రైతుల బాధను ప్రభుత్వం సున్నితంగా పరిగణిస్తోందని పేర్కొన్నారు. వారి భూ హక్కులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డి పెనుబల్లి మండలం ముత్తగూడెం వద్ద హైవే పనులను ఎంట్రీ-ఎగ్జిట్ ప్రాంతంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికే ఇచ్చిన ధరకు అదనంగా 12 శాతం నష్టపరిహారం రైతుల డిమాండ్ ప్రకారం చెల్లించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు. మిగిలిన ముక్కల భూములకు నష్టపరిహారం.. హైవే నిర్మాణంలో ముక్కలుగా మిగిలిన రైతు భూములకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని మంత్రి సూచించారు. రైతుల సాగు ప్రక్రియకు ఇబ్బంది కలగకుండా సర్వీస్ రోడ్లను నిర్మించాలని ఆదేశించారు. అలాగే అవసరమైన మేర డ్రెయిన్‌లను కూడా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి, వైరా ఎమ్మెల్యే రాం దాస్ నాయక్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎన్‌హెచ్ఏఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిస్ రికార్డ్ లక్ష్యంగా బతుకమ్మ వేడుకలు..

**హైదరాబాద్, మహా:** ఈ నెల 29న గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ లక్ష్యంగా సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని, ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క అధికారులను ఆదేశించారు. డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో మంత్రులు గురువారం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో మంత్రులు మాట్లాడుతూ.. ఈ నెల 27న ట్యాంక్ బండ్ పై బతుకమ్మ కార్నివాల్, 28న బైక్, సైకిల్ ర్యాలీలు, 29న సరూర్ నగర్ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో బతుకమ్మ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, 30న ట్యాంక్ బండ్ పై సద్దుల బతుకమ్మ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, ట్యాంక్ బండ్ తో పాటు పీవీ మార్గ్, సచివాలయం, సరూర్ నగర్ స్టేడియం పరిసర ప్రాంతాలన్నింటినీ విద్యుత్ దీపాలతో అలంకరించాలని, బతుకమ్మలను నిమజ్జనం చేసే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, మహిళలకు సౌకర్యాలు కల్పించాలని దిశానిర్ధేశం చేశారు. పండగ ప్రాశస్త్యానికి అద్దంపట్టేలా హైదరాబాద్ లో చారిత్రక ప్రదేశాలతో పాటు ప్రధాన జంక్షన్లను అందమైన ఆకృతులతో, విద్యుత్ దీపాలతో అలంకరించాలి, వైభవోపేతంగా నిర్వహించాలని ఆదేశించారు. పర్యాటక, సాంస్కృతిక, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పోలీస్, ట్రాన్స్‌కో, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సరూర్ నగరం స్టేడియంలో ఈ నెల 29న 10వేల మంది బతుకమ్మ వేడుకలు, 63 అడుగుల ఎత్తైన బతుకమ్మను ఏర్పాటు చేసి గిన్నిస్‌బుక్ రికార్డుల్లో చేర్చేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను తరలించే బాధ్యతను సెర్ప్ అధికారులు తీసుకోవాలని, దీనికి తోడు మిగిలిన వారిని తీసుకువచ్చేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, యాదాద్రి కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని చెప్పారు.

# తిరుమలలో భక్తులకు నూతన వసతి సముదాయం

- **భక్తుల రద్దీ, క్యూలైన్ నిర్వహణ, తక్షణ సమస్యల నివారణ**
- **చర్యల పర్యవేక్షణకు సమీకృత కమాండ్ కంట్రోల్ సెంటర్**
- **ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ తో కలిసి ప్రారంభించిన సీఎం చంద్రబాబు నాయుడు**

**తిరుమల, మహా :** తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు నూతన వసతి సముదాయం అందుబాటులోకి వచ్చింది. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూతన వసతి సముదాయాన్ని (వేంకటాద్రి నిలయాన్ని) గురువారం ప్రారంభించారు. పీఏసీ 5ను రూ.102 కోట్ల వ్యయంతో టీటీడీ నిర్మించింది. ఎలాంటి ముందస్తు బుకింగ్ లేకుండా వచ్చిన భక్తులకు వసతి కల్పించేందుకు నూతన వసతి సముదాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ భవనం ద్వారా ఒకేసారి 4 వేల మంది భక్తులకు ఉచిత వసతి సౌకర్యం కల్పించేలా నిర్మించారు. ఈ నూతన వసతి సముదాయంలో 16 డార్మిటరీలు, 2400 లాకర్లు, 24 గంటలూ వేడినీటి సదుపాయం తదితర సౌకర్యాలతో ఈ పిలిగ్రిమ్స్ అమెనిటీస్ సెంటర్ 5 ను తీర్చిదిద్దారు. అలాగే ఒకేసారి 80 మంది భక్తులు తలనీలాలు సమర్పించేందుకు వీలుగా కల్యాణ కట్టను కూడా ఈ పీఏసీ 5 ప్రాంగణంలో టీటీడీ ఏర్పాటు చేసింది. ఒకేసారి 1400 మంది భక్తులు భోజనం చేసేందుకు వీలుగా ఈ కాంప్లెక్సులో రెండు భారీ డైనింగ్ హాళ్లను కూడా అందుబాటులో ఉంచారు.

ఈ సందర్భంగా వసతి గృహం బుకింగ్ కౌంటర్ లో బుకింగ్ జరుగుతున్న విధానాన్ని అధికారులు వివరించారు. తొలి వసతి బుకింగ్ టోకెన్ ఓ భక్తురాలికి సీఎం




చంద్రబాబు అందించారు. తిరుమల పోటులో కొత్తగా తీసుకువచ్చిన ప్రసాదం తయారీ కోసం వినియోగించే సార్టింగ్ యంత్రాలను ప్రారంభించారు. అనంతరం ఈ ప్రాంగణంలోనే ఏర్పాటు చేసిన వేస్ట్ కలెక్షన్ (వ్యర్థాల సేకరణ) యంత్రాన్ని ఇరువురు నేతలు ఆసక్తిగా పరిశీలించారు.

**టెక్నాలజీతో క్యూలైన్ల నిర్వహణకు ఐసీసీ సెంటర్**

పీఏసీ 5ను ప్రారంభించిన అనంతరం వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని ఐసిసి సెంటర్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అనంతరం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఐటీ మంత్రి నారా లోకేష్, రెవిన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు వేచి ఉండే సమయాన్ని తగ్గించేలా అత్యుత్తమ విధానాన్ని అనుసరించాలని అధికారులకు సూచించారు. అంతకుముందు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం రెడీ అనలటిక్స్, మెషీన్ లెర్నింగ్ సాయంతో నిరీక్షణలో ఎంత మంది భక్తులు ఉన్నారో గుర్తించి అందుకు అనుగుణంగా క్యూలైన్ నిర్వహణ చేపడతామని సంబంధిత అధికారులు వివరించారు. అలాగే భక్తుల వేచి ఉండే క్యూ కాంప్లెక్సుల్లో భక్తి భావన పెంపొందించేలా ఆధ్యాత్మిక వీడియోలను, శ్రీవారి చరిత్రను ప్రదర్శించాలని సీఎం ఆదేశించారు.

తిరుమల కొండపైకి నిషేధిత వస్తువులు తీసుకురాకుండా అలిపిరి వద్దే నిలువరించేలా ఈ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచే టెక్నాలజీ సాయంతో పర్యవేక్షించాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానించిన సీసీ కెమెరాల సాయంతో అలిపిరి నుంచే రద్దీ హీట్ మ్యాప్ లను గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీవారి ఏడుకొండలు ఏడు రంగులతో గ్రీనరీ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మానసిక ప్రశాంతత ఆలయాలలో మాత్రమే ఉంటుందని, ఆలయాల నిర్మాణాలకు, నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దీంతో పాటు టీటీడీ నిర్వహణలోని అన్ని దేవాలయాలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ తో అనుసంధానించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO : APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు
కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919

# హైకోర్టు హెచ్చరించినా లెక్క చేయని ఓజీ



ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమా బెనిఫిట్ షోతో పాటు టికెట్ ధరలను భారీగా పెంచేశారు. అయితే, హోంశాఖ ముఖ్యకార్యదర్శి జారీచేసిన మెమో అమలును సస్పెండ్ చేస్తూ తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. కానీ, కోర్టు నుంచి వచ్చిన ఆదేశాలను కూడా లెక్క చేయలేదని చిత్ర యూనిట్‌పై విమర్శలు వస్తున్నాయి. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను కూడా పాటించరా అంటూ నెటిజన్లు ఆశ్చర్య పోతున్నారు. కోర్టు ఆదేశాల తర్వాత కూడా బుక్ మై షోతో పాటు డిస్ట్రిక్ట్ యాప్‌లలో పెంచిన ధరలే కనిపిస్తున్నాయని కామెంట్లు పెడుతున్నారు. ఈ విషయంలో న్యాయస్థానం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆపై ఓజీ సినిమాకు 'A' సర్టిఫికేట్ జారీ చేయడంతో 18 ఏళ్ల లోపు పిల్లలను థియేటర్లలోకి అనుమతించకుండా చూడాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించిన విషయం తెలిసిందే.. దానిని కూడా వారు పాటించకుండా వ్యవహరిస్తున్నారని నెటిజన్లు పేర్కొంటున్నారు. ఓజీ ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 800 పెంపుతో పాటు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 4 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ. 100, మల్టీప్లెక్స్‌లలో రూ. 150 పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీనిని సవాల్ హైదరాబాద్‌కు చెందిన బి.మల్లేశ్‌యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. 2021లో జారీచేసిన జీవో 120కి విరుద్ధంగా ఓజీ సినిమా టికెట్ ధరలు ఉన్నాయన్నారు. దీంతో న్యాయస్థానం కూడా ప్రభుత్వాన్ని తప్పుబడుతూ పలు వ్యాఖ్యలు చేసింది. కొత్త సినిమాలకు బెనిఫిట్ షోలను ఎవరి ప్రయోజనాల కోసం ప్రదర్శిస్తున్నారని సూటిగానే కోర్టు ప్రశ్నించింది. ఈ షోలతో వచ్చిన డబ్బుతో అనాథలకు ఏమైనా ఆసరాగా వినియోగిస్తున్నారా అంటూ చెప్పాలని కోరింది. కేవలం ఎగ్జిబిటర్లకు లాభాలు చేకూర్చడానికి ఇలా టికెట్ రేట్లు పెంచేందుకు అనుమతిస్తారా అంటూ కడిగి పారేసింది. ఇందుకోసం ప్రభుత్వ నిబంధనలనే ఉల్లంఘిస్తే ఎలా అంటూ ప్రభుత్వాన్ని కోర్టు ప్రశ్నించింది. అయినప్పటికీ టికెట్ ధరలను మాత్రమ తగ్గించలేదు. దీంతో న్యాయస్థానం అంటూ ఎలాంటి గౌరవం లేదా అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

# ఎప్పటికీ రుణపడి ఉంటా..


## ఎల్లలు లేని ఆనందంలో రుక్మిణి

కెరీర్ మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంటే మనసు ఎప్పుడూ ఆనందంలో మునిగి తేలుతుంది. నటి రుక్మిణి వసంత్ ఇప్పుడు అలాంటి ఆనందంలో తేలిపోతున్నారు. 2019లో మాతృభాషలో కథానాయకిగా కెరీర్‌ను ప్రారంభించిన ఈ కన్నడ బ్యూటీ ఆ తరువాత హిందీలో అప్‌స్టార్ట్స్ అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చారు. ఇక తెలుగులోకి అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అంటూ దిగుమతి అయిన ఈమె తమిళంలో విజయ్‌సేతుపతికి జంటగా ఏస్ అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చారు. ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించకపోయినా, శివకార్తికేయన్ సరసన నటించిన మదరాసీ చిత్రం విజయానందాన్నిచ్చింది. కాగా ప్రస్తుతం కన్నడం, తెలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఈమె కన్నడంలో రిషబ్ శెట్టితో నటించిన కాంతార. చాప్టర్ 1 చిత్రం అక్టోబర్ 2న పాన్ ఇండియా చిత్రంగా తెరపైకి రానుంది. దీనితో పాటూ యష్ హీరోగా నటిస్తున్న భారీ చిత్రం టాక్సిక్‌తో పాటు తెలుగులో ఎన్టీఆర్ సరసన డ్రాగన్ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా ఒక భేటీలో రుక్మిణి వసంత్ పేర్కొంటూ తనను నటిగా అంగీకరించిన ప్రేక్షకులకు రుణపడి ఉంటానన్నారు. కాంతార చాప్టర్ 1 తనకు చాలా ముఖ్యమైన చిత్రం అన్నారు. తన నటనను చూసిన రిషబ్ శెట్టి అద్భుతం అన్న అభినందనను జీవితంలో మరిచిపోలేనన్నారు. అదే విధంగా అభిమానులు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు తన మనసు ఎల్లలు లేని ఆనందంలో మునిగితేలుతోందన్నారు. ఇది ఇలాగే కొనసాగాలని భగవంతుని వేడుకుంటున్నానని నటి రుక్మిణి వసంత్ పేర్కొన్నారు. మొత్తం మీద ఈ అమ్మడి కెరీర్ మంచి జోష్‌లో సాగుతోందన్నమాట.





# బన్నీ మాత్రమే నన్ను ఎంకరేజ్ చేశాడు



తమన్నా.. దాదాపు ఇరవై ఏళ్లుగా సినిమాలు చేస్తూనే ఉంది. కుర్రహీరోయిన్లు వస్తున్నా వాళ్లకి పోటీగా హీరోయిన్, స్పెషల్ సాంగ్స్ చేస్తూ రెండు చేతులా సంపాదిస్తోంది. అయితే తాను ఇప్పుడు ఇలా ఉండటానికి అల్లు అర్జున్ కూడా ఓ కారణం అని చెప్పుకొచ్చింది. రీసెంట్‌గా 'డూ యూ వాన్నా పార్ట్‌నర్' అనే వెబ్ సిరీస్‌లో లీడ్ రోల్ చేసింది. దీని ప్రమోషన్స్ కోసం ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ బన్నీ గురించి ఆసక్తికర విషయాన్ని చెప్పుకొచ్చింది.

'అప్పట్లో తెలుగు, తమిళంలో అన్ని రకాల కమర్షియల్ సినిమాలు చేశాను. ప్రతి దానిలోనూ నాలుగైదు సాంగ్స్ ఉండేవి. కానీ అల్లు అర్జున్ మాత్రమే 'బద్రీనాథ్' కోసం నేను కూడా తనతో పాటు సరిసమానంగా డ్యాన్స్ చేయాలని ప్రోత్సాహించాడు. ఫ్లోర్ మూమెంట్స్ నేను కూడా చేస్తానని చెప్పి దర్శకుడిని ఒప్పించి తొలి అవకాశమిచ్చాడు. ఈ మూవీ రిలీజైన తర్వాత నాకు డ్యాన్స్ చేసే ఛాన్సులు చాలా వచ్చాయి. స్పెషల్ నంబర్స్‌కి పాపులర్ అయ్యాను' అని తమన్నా చెప్పుకొచ్చింది.

తమన్నా చెప్పింది చూస్తుంటే నిజమే అనిపిస్తుంది. ఎందుకంటే గత కొన్నేళ్లలో బాలీవుడ్‌లో హిట్ స్పెషల్ సాంగ్స్ ఈమె కనిపించింది. 'ఆజ్ కీ రాత్', నషా, స్పింగ్ జరా, గఫూర్.. ఇలా తదితర పాటల్లో ఓవైపు గ్లామర్ చూపిస్తూ మరోవైపు తన అందచందాలతో అందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది. అలానే అల్లు అర్జున్ ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ కావడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని చెప్పింది. తమన్నా వ్యక్తిగత విషయానికొస్తే ప్రస్తుతం ఈమె వయసు 35 ఏళ్లు. వయసు పెరుగుతున్నా సరే ఈమెకు అవకాశాలు వరసగా వస్తూనే ఉన్నాయి. అలానే మొన్నమొన్నటివరకు నటుడు విజయ్ వర్మతో డేటింగ్ చేసింది. పెళ్లి కూడా చేసుకుంటారేమోనని అందరూ అనుకున్నారు. కానీ వీళ్లిద్దరూ బ్రేకప్ చెప్పేసుకున్నారు.

# డోన్ట్ కేర్ అంటూ ఫ్యాషన్ వీక్‌లో జాక్వెలిన్ ఫెర్నాండేజ్ సందడి

కిక్, రేస్, రైడ్, వెల్‌కమ్, హౌస్‌ఫుల్ సినిమాలతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది శ్రీలంకన్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండేజ్. ఓ వైపు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్న ఈ సుందరి మరోవైపు మనీలాండరింగ్ కేసుతో నిత్యం వార్తల్లో నిలుస్తుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మనీలాండరింగ్ కేసులో తనపై దాఖలైన ఎఫ్ఐఆర్, ఈడీ ఛార్జిషిట్‌ను రద్దు చేయాలని కోరుతూ జాక్వెలిన్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. అంతేకాదు జాక్వెలిన్ క్రిమినల్ విచారణను ఎదుర్కోవాల్సిందేనని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే వివాదాల సంగతి ఎలా ఉన్నా ప్రొఫెషనల్ కమిట్ మెంట్స్ విషయంలో మాత్రం తగ్గేదేలే అంటోంది జాక్వెలిన్ ఫెర్నాండేజ్. తన ఫాలోవర్లు, అభిమానుల కోసం ఈ భామ లండన్ ఫ్యాషన్ వీక్‌లో సందడి చేసింది. లాంగ్ ప్రింటెడ్ బ్లేజర్‌లో మెరిసిన జాక్వెలిన్ ఫెర్నాండేజ్ అనామిక ఖన్నా షోలో హొయలు పోతూ కెమెరాకు ఫోజులిచ్చింది. లండన్ ఫ్యాషన్ వీక్ షోకు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచిన జాక్వెలిన్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. కాగా జాక్వెలిన్ ఫెర్నాండేజ్ తెలుగులో ఓ సినిమా చేసేందుకు రెడీ అవుతుందని కూడా ఇప్పటికే నెట్టింట వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఈ భామ టాలీవుడ్ డైరెక్టర్‌తో సినిమా చేసేందుకు రెడీ అయిందని.. ఫీ మేల్ సెంట్రిక్ సినిమాగా ఈ ప్రాజెక్టు ఉండబోతుందని తెలుస్తుండగా.. దీనిపై రానున్న రోజుల్లో ఏదైనా స్పష్టత వస్తుందేమో చూడాలి మరి.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034